క్లుప్తంగా

నేడు సంక్రాంతి పోటీలు

బిక్కవోలు: సంక్రాంతిని పురస్కరించుకుని బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. బిక్కవోలు మండలానికి చెందిన ప్రజలు తమ పేర్లను 98662 36633 నంబర్‌కు ఫోన్ చేసిగానీ, బిక్కవోలు ఉన్నత పాఠశాల పీడీ ధనరాజ్ వద్ద గానీ నమోదు చేసుకోవాలన్నారు.

జగనన్న కాలనీల పేరు మార్చడం సరికాదు


అడబాల చినబాబు

రాజానగరం: జగనన్న కాలనీలకు పేరు మార్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని వైఎస్సార్ సీపీ వ్యవసాయ విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు ప్రశ్నించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రికార్డు స్థాయిలో పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేశారన్నారు. ఏకంగా ఊర్లే ఏర్పడేలా ఒక్కో గ్రామంలో వందల సంఖ్యలో పట్టాలు ఇచ్చారన్నారు. వాటిలో ఇల్లు కట్టుకుంటున్న పేదలు ఆయా కాలనీలకు జగనన్న అని పేరు పెట్టుకోవడంలో తప్పేముందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం పేదలకు ఒక సెంటు స్థలం కూడా ఇవ్వకపోగా, గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో ఏర్పడుతున్న కాలనీలకు జగనన్న పేరు మార్చాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఇందిరా గాంధీ, ఎన్టీఆర్ పేరుతో ఏర్పడిన కాలనీలకు ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పేర్లు మార్చలేదన్నారు.

మాలల ఐక్య వేదిక ఏర్పాటు


మాలల ఐక్య వేదిక కమిటీ సభ్యులు

రాజానగరం: మండల మాలల ఐక్య వేదిక ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్‌గా ముప్పిడి శ్రీనివాస్, కో కన్వీనర్‌గా మేకల లక్ష్మీపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రతినిధులుగా 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. గ్రామంలోని జగనన్న కాలనీలో శనివారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.

175 క్యూసెక్కుల విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 175 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ జేఈ సుమంత్ శనివారం తెలిపారు. పుష్కర-1 నుంచి ఒక మోటారు ద్వారా ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకూ సాగునీరు విడుదల చేస్తున్నామని వివరించారు. పుష్కర పథకం వద్ద గోదావరి నీటిమట్టం 13.6 మీటర్లుగా ఉందన్నారు.

సంప్రదాయ క్రీడలే ముద్దు

పెదపూడి: పండగ సందర్భంగా సంప్రదాయ క్రీడలపై యువత ఆసక్తి చూపాలని అనపర్తి ఎస్సై శ్రీనునాయక్ అన్నారు. అనపర్తి మండలంలో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. కోడి పందేల నిర్వహణకు సిద్ధం చేస్తున్న బరులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. కోడి పందేలు, జూదం నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తపాలా ఉద్యమ నాయకుడికి నివాళి


శివ నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తపాలా సిబ్బంది

పెదపూడి: విప్లవ గీతాలతో జీడీఎస్ ఉద్యమానికి ఊపిరి పోసిన ఉద్యమ కారుడు డి.శివ నాగేశ్వరరావు (డీఎస్ఎన్) అని తపాలా ఉద్యోగుల సంఘం కోశాధికారి వై.కామేశ్వరి అన్నారు. ఇటీవల గుండెపోటుతో శివనాగేశ్వరరావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయనకు శనివారం అనపర్తి సబ్ పోస్టాఫీసు ఆవరణలో ఉద్యోగులు నివాళులర్పించారు. కామేశ్వరి మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి అయినప్పటికీ జీడీఎస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గ్రామీణ తపాలా ఉద్యోగుల ఉద్యమాలకు అండదండలు అందించారని కొనియాడారు. ఎముకల కొరికే చెరలో సైతం 15 రోజుల పాటు ఢిల్లీలో గ్రామీణ తపాలా ఉద్యోగుల కోసం నిరాహార దీక్ష చేశారని తెలిపారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ కె.సుమంత్, డి.మల్లేశ్వరి, పి.శ్రీనివాస్, టీ.తరుణ్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం.. వీరికి కలవరం

- పుష్కర కాంట్రాక్టు ఉద్యోగుల బెంబేలు
- ప్రాజెక్టు పూర్తయితే ఉద్యోగాలు పోతాయని ఆవేదన
- ప్రత్యామ్నాయం చూపాలని వినతి


పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం

సీతానగరం: వారందరూ కష్టాన్నే నమ్ముకుని, కాంట్రాక్టు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరుద్యోగులు. చాలీచాలనీ జీతాలలో కుటుంబాలను పోషించుకుంటున్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి పంటల సాగుకు నీరు విడుదల చేయడంలో కీలకంగా ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తవ్వాలని రాష్ట్ర ప్రజలందరూ ఎదురుచూపులు చేస్తున్నారు. దానివల్ల రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతుందని, సాగు, తాగు నీటికి ఢోకా ఉండదని చెబుతున్నారు. కానీ పోలవరం పూర్తయితే వీరి ఉద్యోగాలు పోతాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో తమను పర్మినెంట్ చేయాలని, ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలని కోరుతున్నారు.

22 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు

మండలంలోని పురుషోత్తపట్నం తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నెలకొల్పినప్పటి నుంచి కాంట్రాక్ట్ బేసిక్‌పై 22 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో తొమ్మిది మంది ఆపరేటర్లు, ఆరుగురు హెల్పర్లు, నలుగురు వాచ్‌మెన్లు, ఇద్దరు పైపులైన్ వర్కర్లు, ఒక గార్డెనర్ ఉన్నారు. వీరందరూ 1.55 లక్షల ఎకరాలకు నీరందించే విషయంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రతి ఏడాది జూలై ఆఖరి వారంలో పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేసే సమయంలో వచ్చే ప్రజా ప్రతినిధులకు తమ సమస్యలను వివరిస్తున్నారు. తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందిస్తున్నారు. అయినా ఫలితం లేకుండా పోతోంది. ప్రతి నెలా జీతాలు సక్రమంగా అందుతున్నా, భవిష్యత్తులో రోడ్డున పడుతామనే భయాందోళనలో కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు.

పర్మినెంట్ చేయాలని..

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే నేరుగా పుష్కర ఎత్తిపోతల పథకం కాలువలకు ఆ ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి నీరు వెలుతుంది. దీంతో పుష్కర పథకాలు నిరుపయోగంగా మారుతాయి. అప్పుడు కాంట్రాక్టు బేసిక్‌పై పనిచేస్తున్న తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం ద్వారా సాగునీరు విడుదల సమయంలో వచ్చే ఎంపీలకు, ఎమ్మెల్యేలకు గోడు వెళ్లబోసుకుంటున్నా ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తమకు పని లేకుండా పోతుందని, ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమను పర్మినెంట్ చేయాలని వేడుకుంటున్నారు.

ప్రయోజనం లేదు



పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నెలకొల్పినప్పటి నుంచీ పనిచేస్తున్నాను. ఇప్పటి వరకు పర్మినెంట్ చేయలేదు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే మేము రోడ్డున పడే అవకాశం ఉంది. పథకం నుంచి సాగునీరు విడుదలకు వచ్చే ప్రజాప్రతినిధులకు చాలా సార్లు వినతిపత్రాలు అందించాం. కానీ ప్రయోజనం లేకుండా పోయింది.

– ఎస్.లక్ష్మణరావు, ఆపరేటర్

నిరుపయోగం



పోలవరం ప్రాజెక్టు పూర్తయితే పుష్కర పథకం మూతపడుతుంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి పుష్కర కాలువలోకి నీరు మళ్లిస్తారని చెబుతున్నారు. దీంతో పుష్కర పథకం నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. మాకు కుటుంబాలు రోడ్డున పడతాయి. మమ్మల్ని పర్మినెంట్ చేసి, కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఆకుమూరి వీర్రాజు, ఫిట్టర్

భోగిమంటకు సర్వం సిద్ధం


పందలపాకలో దుంగ తీసుకువస్తున్న చిన్నారులు

బిక్కవోలు: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా పిల్లలు భోగమంట కోసం దుంగలు, కట్టెలను సేకరిస్తూ కనిపిస్తున్నారు. పాఠశాలలకు సెలవు కావడంతో స్నేహితులతో కలిసి ఉత్సాహంగా పుల్లలను సేకరిస్తున్నారు.


సైకిల్‌పై దుంగలను తీసుకువస్తున్న పిల్లలు

రామ మందిరంలో ప్రత్యేక పూజలు

పెదపూడి: అనపర్తి పాత ఊరిలో సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి ఆధ్వర్యంలో కొలువు తీర్చిన రామాలయంలో శనివారం సామూహిక పూజలు, నామ పారాయణ, నామ సంకీర్తనలు ఘనంగా నిర్వహించారు. అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ మొదటి సంవత్సర వేడుకలు పురస్కరించుకుని నక్షత్రం తిథి ప్రకారం జనవరి 11 నాటికి సంవత్సర పూర్తయిన సందర్భంగా హైందవ సంఘాలు ప్రతి ఊరి రామాలయాల్లో రామచంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని సంకల్పించాయి. ఈ నేపథ్యంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రామ మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

అధికారులు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- కోరుకొండ మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

మధురపూడి: అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి అధ్యక్షతన శనివారం సర్వ సభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం, పాత రోడ్లకు మరమ్మతులు, గోకులం షెడ్ల పనులు జరుగుతున్నాయని, ఇవి ఈ నెలాఖరుకు పూర్తవుతాయని తెలిపారు. ప్రభుత్వ శాఖల వారీగా జరిగిన అభివృద్ధి నివేదికను అధికారులు వెల్లడించారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి సంబంధించి సత్యసాయి మంచినీటి పథకం నిర్వహణ సక్రమంగా జరగడం లేదని సభ్యులు తెలిపారు. ఈ పథకానికి చెందిన మూడు మోటార్లు కాలిపోవడంతో సమస్య ఉత్పన్నమైందని, దాన్ని త్వరలో పరిష్కరిస్తామని జేఈ రామకృష్ణ బదులిచ్చారు. కాగా.. సమావేశంలో 2024–25 సంవత్సరానికి రూ.21,43, 99,483 సవరణ బడ్జెట్‌ను, 2025–26 సంవత్సరానికి రూ.2195,03,300 అంచనా బడ్జెట్‌ను, రూ.33,000 మిగులు బడ్జెట్‌ను ఈఓపీఆర్డీ మహేశ్వర ప్రతాప్ ప్రతిపాదించారు. వీటిపై సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ బి.అశోక్ కుమార్, వైస్ ఎంపీపీ కొయిడాల స్వర్ణకుమారి, జెడ్పీటీసీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు, మండల నాయకుడు ఉల్లి బుజ్జిబాబు పాల్గొన్నారు.

సీటు కాదు.. చోటుంటే చాలు..


బస్ కాంప్లెక్స్‌లో వేచిఉన్న ప్రయాణికులు


రైల్వేస్టేషన్‌లో నెలకొన్న రద్దీ

- పండగ నేపథ్యంలో పోటెత్తిన ప్రయాణికులు
- రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో విపరీతమైన రద్దీ
- ప్రత్యేక సర్వీసులు తిప్పుతున్న అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఈ మేరకు శనివారం జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో విపరీతమైన రద్దీ నెలకొంది. జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, నిడదవోలు, కొవ్వూరు ఆర్టీసీ డిపోల నుంచి రెగ్యులర్‌గా నడిచే 270 బస్సులతో పాటు 144 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఇవన్నీ ప్రయాణికులతో నిండిపోతున్నాయి. వారి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను 24 గంటలూ ఏర్పాటు చేస్తున్నామని డీపీటీఓ షర్మిల అశోక తెలిపారు. అలాగే రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోయింది. రిజర్వేషన్ బోగీలు సైతం అన్ రిజర్వ్‌డ్ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పండగ సందర్భంగా జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు తిరుగుతున్నాయి. రైల్వే అధికారులు ఇప్పటికే చర్లపల్లి – విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. శనివారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు జిల్లా మీదుగా రాకపోకలు సాగించే విధంగా జనసాధారణ్ (అన్ రిజర్వుడు) రైళ్లు తిరగనున్నాయి. రాజమహేంద్రవరం మీదుగా నిత్యం 120 ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

చక్రద్వారబంధంలో గంజాయి పట్టివేత

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధంలో గంజాయితో ఇద్దరు నిందితులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. సీఐ వీరయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన షేక్ అన్వర్, బంక దీపక్ మారేడుమిల్లి నుంచి గంజాయిని తీసుకువచ్చి, ఈ ప్రాంతంలో కాలేజీ విద్యార్థులకు విక్రయించి, సొమ్ములు చేసుకుంటారు. ఈ క్రమంలో ఆ ఇద్దరు శనివారం సాయంత్రం చక్రద్వారబంధం వచ్చిన కాలేజీ విద్యార్థులుండే ప్రాంతంలో తచ్చాడసాగారు. వారిని అనుమానించిన స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. దీనితో ఎస్సై మనోహర్ సిబ్బందితో వెళ్లి ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, విచారించడంతో అసలు విషయం బయటకు వచ్చింది. విద్యార్థులకు విక్రయించేందుకు గంజాయి తీసుకువచ్చినట్టుగా అంగీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రారండోయ్... వేడుక చూద్దాం


దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు


సంపరలోని భారతి స్కూల్లో..

- ఘనంగా సంక్రాంతి సంబరాలు
- విద్యాసంస్థల్లో ముందస్తు వేడుకలు

రాజానగరం: అనపర్తి, రాజానగరం నియోజకవర్గంలోని పలు విద్యాసంస్థల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో విద్యార్థులకు పండగపై అవగాహన కలిగిస్తూ ఘనంగా నిర్వహించారు. హరిదాసు సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జంగమ దేవర, సోదమ్మ కళాకారులు ప్రదర్శనలిచ్చారు. అనంతరం భోగి మంట చుట్టూ విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన పెద్దలతో కలసి ఉపాధ్యాయులు భోగి పండ్లు వేసి, ఆశీస్సులు అందించారు.

సంస్కృతిని రక్షించుకోవాలి

పెదపూడి: సంక్రాంతి సంబరాలను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సంపరలోని భారతి స్కూల్ కరస్పాండెంట్ కె.హనుమంతు అన్నారు. ఆ పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలో అక్షర ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివార సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ముగ్గుల పోటీలు, గొబ్బెమ్మలు, కుస్తీ పోటీలు, బొమ్మల కొలువు, భోగిపండ్లు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొమరిపాలెంలో చిన్నారుల డ్యాన్సులు

కోడిపందేలు చూడడం కూడా నేరమే


బిక్కవోలులో ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న తహసీల్దార్ వెంకటకృష్ణ తదితరులు

బిక్కవోలు: కోడిపందేలు వేయడంతో పాటు చూడడమూ నేరమేనని తహసీల్దార్ బి.సత్యవీర వెంకటకృష్ణ అన్నారు. కోడిపందేల నిర్వహణను అరికట్టే చర్యల్లో భాగంగా పోలీసు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బిక్కవోలు, కొమరిపాలెం, బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కోడి పందేలు, పేకాట, గుండాట, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోడి పందేల బరి ధ్వంసం


కోడిపందేల బరిని ధ్వంసం చేస్తున్న ట్రాక్టర్

పెదపూడి: మండలంలోని కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.రామారావు హెచ్చరించారు. కోడి పందాలు నిర్వహించే అవకాశం ఉన్న ఏపీత్రయం, వేంద్ర, శహపురం గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలిసి శనివారం పర్యటించారు. ఇప్పటికే ఏర్పాటు చేస్తున్న బరులను ట్రాక్టర్లతో ధ్వంసం చేయించారు.

ఓబన్న జయంత్యుత్సవం


బిక్కవోలులో ఓబన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సిబ్బంది

బిక్కవోలు: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మండల పరిషత్ పరిపాలనాధికారి వీడీ రత్నకుమార్ మాట్లాడుతూ 39 ఏళ్ల వయస్సులోనే రేనాటి స్వాతంత్ర యుద్ధంలో ఆంగ్లేయుల చేతుల్లో వీరమరణం పొందారన్నారు. కార్యాలయం సిబ్బంది మంగరాజు, మహేష్ పాల్గొన్నారు.

నర్సరీ రంగ సమస్యలపై వినతి

కడియం: నర్సరీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ హార్టీకల్చర్ కమిషనర్ డాక్టర్ ప్రభాకుమార్‌కు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, పాలకవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కడియపులంకలోని అసోసియేషన్ కార్యాలయం వద్దకు శనివారం విచ్చేసిన కమిషనర్‌కు సంబంధిత సమస్యలను విన్నవించారు. కేంద్ర ప్రభుత్వ రాయితీపై నర్సరీ ఉపకరణాలు అందించాలన్నారు. మట్టికి బదులుగా మీడియా తయారు చేసి మేలైన పద్ధతుల్లో నర్సరీ కల్టివేషన్ చేసే విధంగా ప్రభుత్వం ద్వారా శాస్త్రవేత్తలు మార్గదర్శకాలు చూపాలన్నారు. పోలీహౌస్‌లు, షేడ్ నెట్లు కేంద్ర ప్రభుత్వ రాయితీతో ఇప్పించాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన రైతులకు మేలు జరిగే విధంగా చూస్తామన్నారు. అనంతరం శివాంజనేయ నర్సరీని సందర్శించారు. ఫ్లోరికల్చర్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త డీవీఎస్ రాజు, సిబ్బంది, బృందం, ఈఏవై డీహెచ్‌వో సుజాత కుమారి, ఏపీఎంఐపీ పీడీ దుర్గేశ్, హార్టికల్చర్ ఆఫీసర్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సేవలు ఆదర్శనీయం

రాజమహేంద్రవరం రూరల్: పేదలకు, నిరాశ్రయులకు స్వర్ణాంధ్ర అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని జీవిత బీమా సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి ఆవిష్కరించారు. ఈ మేరకు శనివారం స్వర్ణాంధ్ర సేవా సంస్థ 2025 డైరీని ఆమె ఆవిష్కరించారు. ఎల్ఐసీ మోరంపూడి డివిజనల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, బృందంతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ నిధులు లేకుండా 27 సంవత్సరాలుగా సేవా సంస్థ నడపడం చాలా గొప్ప విషయం అన్నారు. నిర్వాహకుడు రాంబాబు జీవిత బీమా సంస్థ ఉద్యోగిగా, ఉద్యోగుల సంఘం నాయకుడిగా, సేవలందించి స్వచ్ఛంద పదవీ విరమణతో పూర్తి సమయం సమాజ సేవ కోసం అంకితమవడం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా సంధ్యారాణిని స్వర్ణాంధ్ర పక్షాన సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర ఉపాధ్యక్షుడు బత్తుల భరణీ తాతేశ్వర్, సహాయ కార్యదర్శి ఎలిపే శ్రీనివాస్, పులగుర్త సాయిబాబా, స్వర్ణాంధ్ర సిబ్బంది హరి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టి గెలిచిన చంద్రబాబు

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెట్టి చంద్రబాబు విజయం సాధించారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగస్తుల గురించి మాత్రమే మాట్లాడి, రాష్ట్రంలోని 2.70 లక్షల మంది వలంటీర్ల గూర్చి మాట్లాడకపోవడం దారుణమన్నారు. వలంటీర్లకు రూ.5 వేలు బదులుగా రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చాక వారి గురించి మర్చిపోయారన్నారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడాలని డిమాండ్ చేశారు.